క్లుప్తంగా

అథ్లెటిక్స్‌లో ప్రతిభ

తుగ్గలి: మూడు రోజుల క్రితం అనంతపురంలో ఆర్టీటీ ఆధ్వర్యంలో నిర్వహించిన గ్రామీణ బాలికల అథ్లెటిక్స్ కేంద్రస్థాయి పోటీల్లో తుగ్గలి విద్యార్థిని మానస ప్రతిభ కనబరిచింది. జెడ్పీహెచ్ఎస్‌లో 10వ తరగతి చదువుతున్న మానస లాంగ్‌జంప్‌లో మొదటి స్థానంలో నిలిచింది.ఈ సందర్భంగా గురువారం పాఠశాల హెచ్ఎం జయలక్ష్మి క్రీడాకారిణిని అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ చందూనాయక్, ఉపాధ్యాయులు బాబురావు, సుధాకర్, నారాయణ, రజాక్, రిజ్వాన ఉన్నారు.

సీఐ బాధ్యతల స్వీకరణ


సీఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి

పత్తికొండ రూరల్: పత్తికొండ రూరల్ సీఐగా ప్రవీణ్‌కుమార్ రెడ్డి గురువారం బాధ్యతలు తీసుకున్నారు. వీఆర్‌లో ఉన్న ఈయన ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు పత్తికొండ సీఐగా నియమితులయ్యారు. ఆయనకు స్థానిక పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు. అనంతరం సీఐ మర్యాదపూర్వకంగా డీఎస్పీ శ్రీనివాస్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సర్కిల్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు.

సాయినాథుడికి వెండి హారం

వెల్దుర్తి: స్థానిక జర్నలిస్ట్ కాలనీలో కొలువైన సద్గురు సాయినాథునికి పట్టణానికి చెందిన నిర్వష్ణు, త్రివిధ్య చిన్నారుల తల్లితండ్రులు గురువారం వెండి హారం బహూకరించారు. శ్రావణపౌర్ణమి పురస్కరించుకుని స్వామివారికి అభిషేకం నిర్వహించి హారాన్ని అలంకరించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు నాగ సుదర్శన్ రెడ్డి, శ్రీధర్ శర్మ, గోపినాథ్ నాయుడు, చిరంజీవి, మధు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలు వేగవంతం చేయండి


మంత్రి జయరాంను మర్యాదపూర్వకంగా కలిసిన హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తి

ఆలూరు: జిల్లాలోని జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం జిల్లా హౌసింగ్ పీడీ సిద్ధలింగమూర్తికి సూచించారు. స్థానిక మంత్రి నివాసంలో గురువారం మంత్రిని పీడీ మర్యాదపూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం మంత్రి జగనన్న కాలనీలలోని గృహ నిర్మాణాలపై పలు సూచనలు చేశారు. నిరుపేదల సొంతింటి కలను సాకారం చేసేందుకు కృషి చేయాలన్నారు. మంత్రి సోదరులు, ఈఈ ప్రభాకర్, డీఈ ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి


వైఎస్సార్‌సీపీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న మల్లికార్జున యాదవ్

మద్దికెర: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లి అర్హులైన వారికి మంజూరు కాకపోతే అందించేందుకు కృషి చేయడమే గాకుండా పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామని జిల్లా కార్యదర్శి మల్లికార్జున యాదవ్ అన్నారు. గురువారం కర్నూలులో జిల్లా అధ్యక్షుడు బీవై రామయ్యను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. పార్టీ తనపై నమ్మకంతో జిల్లా కార్యదర్శిగా ఎంపిక చేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. జిల్లాలో పార్టీ పటిష్టతకు శక్తి వంచన లేకుండా కృషి చేస్తానన్నారు. ఈయనతో పాటు విద్యావేత్త వెంకట్‌మాధవ్, నాయకులు సోమశేఖర్, రామాంజులు, రాజా తదితరులు ఉన్నారు.

ట్రాఫిక్ సిగ్నళ్ల ఏర్పాటుకు చర్యలు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో రోజు రోజుకూ పెరిగిపోతున్న ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు గాను సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేసేందుకు మున్సిపల్, పోలీసు శాఖలు శ్రీకారం చుట్టాయి. ఈ మేరకు గురువారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, డీఈ మనోహర్‌రెడ్డి, పట్టణ ఎస్ఐ రమేష్‌బాబుతో పాటు ట్రాఫిక్ సిగ్నల్ ఏజెన్సీ వారు పట్టణంలోని సోమప్ప సర్కిల్, శివ సర్కిళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ఆయా సర్కిళ్లలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించే దిశగా సిగ్నల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. అలాగే ముఖ్యమైన కూడళ్లలో సీసీ కెమెరాలుఏర్పాటు చేస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

గోనెగండ్ల: మండల పరిధిలోని గంజిహళ్లి, బైలుప్పల గ్రామాల మధ్య గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో రాజేశ్వరి (20) అనే మహిళ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. కోసిగి మండలం కమాల్‌దొడ్డి గ్రామానికి చెందిన ఆమె భర్త భీమయ్య మద్యానికి బానిస కావడంతో అలవాటు మాన్పించేందుకు గంజిహళ్లి గ్రామంలో వేసే నాటు మందు కోసం ఇద్దరు బైక్‌పై వచ్చారు. నాటు వైద్యం చేయించుకొని సొంత గ్రామానికి తిరుగు ప్రయాణమయ్యారు. ఈ క్రమంలో బైక్ అదుపు తప్పి కిందపడటంతో రాజేశ్వరికి తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. భీమయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. ఈ మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు వారు తెలిపారు.

సంక్షేమ ప్రభుత్వాన్ని ఆదరించండి

- రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం
- ఏరూరులో 'గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం'
- ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు


ఏరూరులో ప్రజలనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి జయరాం

చిప్పగిరి: ప్రజా సంక్షేమానికి అత్యంత ప్రాధాన్యత ఇచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించండి అని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గుమ్మనూరు జయరాం విజ్ఞప్తి చేశారు. ఆయన గురువారం మండలంలోని ఏరూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయా లేదా అని ఆరాతీశారు. అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందని వారు ఉంటే పథకాలు అందించేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ప్రజలనుద్దేశించి మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ నాలుగేళ్ల పాలనలో ఏరూరు గ్రామానికి రూ.7.63 కోట్లు లబ్ధి చేకూర్చినట్లు వివరించారు. త్వరలో హంద్రి–నీవా కాలువకు తూము ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. తన రాజకీయ ప్రయాణం ఈ గ్రామం నుండే మొదలైందని, తన ఎదుగుదలకు సహకరించిన గ్రామ ప్రజలను ఎన్నటికీ మరువలేనన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమ పథకాల ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చారని వివరించారు. ప్రజా సంక్షేమం కోసం అనేక కార్యక్రమాలు చేస్తుంటే ప్రతిపక్ష పార్టీలు విమర్శించడమే పనిగా పెట్టుకొని ప్రజలను తప్పుదోవ పట్టించేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరోపించారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్న ముఖ్యమంత్రి కావడం ఖాయమని పేర్కొన్నారు. అనంతరం గ్రామంలో రూ.25 లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మంత్రి సోదరులు గుమ్మనూరు నారాయణ స్వామి, శ్రీనివాసులు, ఆలూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ గుమ్మనూరు నారాయణ, ఎంపీపీ జూటూరు హేమలత, మారయ్య సింగిల్ విండో అధ్యక్షుడు మల్లికార్జున, కన్వీనర్ రంగస్వామి, సర్పంచ్ వెంకట లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసేవకు ముందుంటాం


మహిళకు సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే

వెల్దుర్తి: ప్రజా సేవకు ఎల్లప్పుడూ ముందుంటానని, ఎమ్మెల్యే పదవి తనకు హోదా కాదని, బాధ్యత అని పత్తికొండ ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి అన్నారు. నియోజకవర్గంలో ఎమ్మెల్యే నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం ప్రతి ఊరిలో ఉత్సాహంగా సాగింది. తమ సంక్షేమం కోసం పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎమ్మెల్యేకు తమ ఆశీస్సులు ఎప్పుడూ ఉంటాయని ప్రజలు దీవించారు. వెల్దుర్తి మండలం ఎల్.నగరం పంచాయతీ దాసరదొడ్డి తండా, ఎల్ తండా, ఎల్ నగరం గ్రామంలో సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డితో కలిసి గురువారం నిర్వహించిన కార్యక్రమంతో ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి గత 15 నెలలుగా నిర్వహిస్తున్న గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ముగిసింది. ఆయా గ్రామాలలో ఎమ్మెల్యే ప్రతి లబ్ధిదారుడి వద్దకు వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలను వివరించి బుక్‌లెట్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. గత ఏడాదిన్నరగా నిత్యం ప్రజల్లో ఉంటూ వారి సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. నియోజకవర్గంలో 302 రోజులు కార్యక్రమం చేపట్టి 78 సచివాలయాల పరిధిలోని 81,941 కుటుంబాలను కలుసుకోవడం జరిగిందన్నారు. ఆయా సచివాలయాల పరిధిలో రూ.15.6 కోట్లతో సమస్యల పరిష్కారం, అభివృద్ధి పనులు చేపట్టినట్లు వివరించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, మద్దికెర జెడ్పీటీసీ సభ్యుడు మురళీధర్ రెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు మల్లికార్జున యాదవ్, శాంతన్న స్వామినాయక్, సూరి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఎల్.నగరం సచివాలయంలో ఆధార్ సేవలు

వెల్దుర్తి: మండల పరిధిలోని ఎల్.నగరం సచివాలయంలో ఆధార్ సేవలను గురువారం ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గ్రామీణ ప్రజలకు సైతం ఆధార్ సేవలు అందుబాటులోకి తేవడం గర్వనీయమన్నారు. సచివాలయంలో మొదటిసారి ఆధార్ తీసుకునేవారికి, చిన్నారుల వివరాల అప్‌డేట్ సేవలు ఉచితం అని పేర్కొన్నారు. ప్రభుత్వం ఆధార్ సేవల నిమిత్తం 15 రకాల ఎలక్ట్రానిక్ పరికరాల కిట్‌ను అందిస్తూ, డిజిటల్/వెల్ఫేర్ అసిస్టెంట్లకు ప్రత్యేక శిక్షణ ఇస్తోందన్నారు ప్రజలకు మెరుగైన సేవలందించాలని సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీఓ శ్రీనివాసరావ్, సచివాలయ కన్వీనర్ల మండల ఇన్‌చార్జ్ సమీర్‌కుమార్ రెడ్డి, ఈఓఆర్డీ నరసింహులు పాల్గొన్నారు.

సోదర బంధానికి ప్రతీక రక్షాబంధన్

ఆలూరు: అన్నాచెల్లెలు, అక్కాతమ్ముళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా జరుపుకునే రక్షాబంధన్‌ని గురువారం ఘనంగా జరుపుకున్నారు. రాఖీలు కట్టిన సోదరీమణులకు అన్నదమ్ములు చిరుకానుకలను అందజేశారు. స్థానిక మంత్రి నివాసంలో గురువారం ప్రజాపిత ఈశ్వరీయ విశ్వవిద్యాలయం నిర్వాహకురాలు బీటీ లక్ష్మి మంత్రికి రాఖీ కట్టి శుభాకాంక్షలను తెలియజేశారు. మంత్రి మాట్లాడుతూ రక్షాబంధన్ విశిష్టతను వివరించారు. అలాగే ఏరూరు గ్రామంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి జయరాంకు పలువురు మహిళలు రాఖీ కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. మహిళా అభ్యున్నతే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోందని, తానూ అండగా ఉంటానని మంత్రి భరోసా ఇచ్చారు.


ఏరూరులో మంత్రి జయరాంకు రాఖీ కడుతున్న మహిళ

పత్తికొండ రూరల్: పత్తికొండలోని చక్రాళ్ల రోడ్డు కూడలిలో సేవాదళ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కటౌట్‌కు మహిళలు రాఖీలు కట్టి, హారతులిచ్చి అభిమానం చాటుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకుడు పోచిమిరెడ్డి మురళీధర్‌రెడ్డికి రాఖీలు కట్టి ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు.

జగనన్నతోనే సామాజిక న్యాయం

గోనెగండ్ల: రాష్ట్రంలో సామాజిక న్యాయం అమలవుతోందని నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు ఎర్రకోట జగన్‌మోహన్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని పుట్టపాశం గ్రామంలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, కర్నూలు నగర మేయర్ బీవై రామయ్య వాల్మీకి విగ్రహానికి పుల మాల వేసి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పెద్దపీట వేశారన్నారు. జిల్లాలో వాల్మీకులకు కీలకమైన పదవులు కట్టబెట్టిన ఘనత జగనన్నదే అన్నారు. వీరశైవ లింగాయత్ కార్పొరేషన్ డైరెక్టర్ గోపాల్ రెడ్డి, సర్పంచ్ నరసింహ రెడ్డి పాల్గొన్నారు.

క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి

నందవరం: రైతులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తించాలంటే తప్పనిసరిగా క్రాప్ బుకింగ్ చేయించుకోవాలని ఏఓ మర్రి స్రవంతి సూచించారు. గురువారం మండల పరిధిలోని నదికైరవాడి గ్రామంలో పంట నమోదు దరఖాస్తులను ఏఓ పరిశీలించారు. ఆమె మాట్లాడుతూ.. మండలంలో 41,000 ఎకరాల్లో పంటలు రైతులు సాగు చేశారన్నారు. ఇప్పటివరకు 22,000 ఎకరాల్లో ఈ క్రాప్ బుకింగ్ పూర్తయిందన్నారు. 50 శాతం పూర్తయినట్లు పేర్కొన్నారు. రైతులకు ఇబ్బందులు లేకుండా పంట నమోదు చేయాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. ఏఈఓ ప్రభావతి, వీఏఏ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మద్దికెర: ఖరీఫ్ సీజన్‌లో పంటలు సాగుచేసిన రైతులు తప్పనిసరిగా ఈ–క్రాప్ బుకింగ్ చేయించాలని ఏఓ రవి అన్నారు. గురువారం మండలంలోని ఆయా గ్రామాలలో చేపట్టిన ఈ–క్రాప్ బుకింగ్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయాధికారులు రైతుల పొలాలకు వెళ్లి ఎంత విస్తీర్ణంలో ఏఏ పంటలు సాగు చేశారో నమోదు చేస్తున్నారన్నారు. రైతు భరోసా కేంద్రాలలో అధికారులను సంప్రదించి పంటలు నమోదు చేయించుకోవాలని సూచించారు. వీఏఏలు జాకీర్, ఆనంద్, రాణి పాల్గొన్నారు.

విజిలెన్స్ తనిఖీలు


చార్వి ఆగ్రోస్ ఏజెన్సీ దుకాణంలో తనిఖీ చేస్తున్న విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని వాల్మీకి సర్కిల్ సమీపంలో చార్వి ఆగ్రోస్ ఏజెన్సీ దుకాణంలో గురువారం సాయంత్రం విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా విజిలెన్స్ సీఐ సునీల్‌కుమార్ మాట్లాడుతూ షాప్‌లో 2043 రకం హైబ్రిడ్ మిరప విత్తన ప్యాకెట్లకు బిల్లులు సక్రమంగా లేవని గుర్తించినట్లు చెప్పారు. రూ.34 వేల విలువ చేసే మిరప విత్తన ప్యాకెట్ల అమ్మకాలను నిలుపుదల చేశామని తెలిపారు. వాటికి సంబంధించిన బిల్లులు చూపని పక్షంలో జిల్లా అధికారులు చర్యలు తీసుకుంటారని చెప్పారు. విత్తనాలు విక్రయించే వ్యాపారులు తప్పకుండ బిల్లులు ఉంచుకోవాలని పేర్కొన్నారు.

59 మంది ఉద్యోగులకు షోకాజ్ నోటీసులు

హొళగుంద: మండలంలో ఆయా సచివాలయాల్లో పనిచేస్తున్న 59 మంది ఉద్యోగులకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ రాధ గురువారం షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సిటిజన్ అవుట్‌రీచ్ ప్రాజెక్ట్ (సీఓపీ) సర్వేలో వంద శాతం పూర్తి చేసి లక్ష్యాన్ని చేరుకోవడంలో వెనుకబడినందుకు నోటీసులు జారీ చేసినట్లు ఎంపీడీఓ తెలిపారు. గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సచివాలయ ఉద్యోగులతో సమావేశం ఏర్పాటు చేసి విధుల పట్ల అలసత్వం, వంద శాతం సీఓపీ సర్వే చేయకపోవడం, సకాలంలో పెండింగ్ పనులు పూర్తి చేయని వారిపై మండిపడ్డారు. తీరు మార్చుకోకపోతే తగిన చర్యలకు ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని హెచ్చరించారు. వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు సమన్వయంగా పని చేస్తూ ప్రజలకు సేవలందించాలని సూచించారు. ప్రజాప్రతినిధులతో పాటు పనుల కోసం సచివాలయాలకు వచ్చిన వారికి సిబ్బంది కనీసం గౌరవం ఇవ్వకుండా ఇష్టారాజ్యంగ వ్యవహరిస్తున్నారని ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎంపీటీసీలు, ఇతర ప్రజాప్రతినిధులు ఆరోపించిన సంగతి తెలిసిందే. ఇదిలాఉండగా కొందరు తప్పు చేస్తే అందరికీ నోటీసులు ఇవ్వడం పట్ల పలువురు ఉద్యోగులు విచారం వ్యక్తం చేశారు.

కొత్తగా 169 పింఛన్లు మంజూరు

తుగ్గలి: మండలవ్యాప్తంగా 169 మందికి కొత్తగా పింఛన్లు మంజూరైనట్లు ఎంపీడీఓ సావిత్రి తెలిపారు. ఇప్పటివరకు 7,540 పింఛన్లు ఉండగా ప్రస్తుతం కొత్త వాటితో కలిపి 7,682 పింఛన్లు ఉన్నాయన్నారు. మొత్తం రూ.2,12,47,500 పింఛన్ సొమ్ము మంజూరైందన్నారు. శుక్రవారం నుంచి వలంటీర్లు లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ సొమ్ము అందజేస్తారన్నారు.

రీసర్వే వేగవంతం చేయండి

కృష్ణగిరి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూముల సమగ్ర సర్వేను వేగవంతంగా చేపట్టాలని తహసీల్దార్ రాజేశ్వరి ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో గురువారం రీ సర్వేపై వీఆర్వోలతో చర్చించారు. మండలంలోని లక్కసాగరం, ఆగవేలి, పోతుగల్లు గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. ఈ గ్రామాల్లో ప్రతి రోజు వంద ఎకరాల్లో సర్వే పూర్తి చేయాలని సూచించారు. రీ సర్వే చేసేందుకు క్షేత్రస్థాయికి వచ్చే రెవెన్యూ అధికారులకు రైతులు సహకరించాలని కోరారు. రెవెన్యూ సమస్యలపై వచ్చే రైతుల పట్ల ఆయా గ్రామాల వీఆర్వోలు హుందాగా వ్యవహరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బంగారు గొలుసు చోరీ

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌లోని 1వ నెంబర్ ప్లాట్ ఫారంలో గురువారం సాయంత్రం మహిళ మెడలోని చైన్ చోరీకి గురైంది. మండల పరిధిలోని టీఎస్ కూళ్లూరు గ్రామానికి చెందిన శారద అనే మహిళ కర్నూలు బస్సు ఎక్కి సీట్లో కూర్చున్న తరువాత మెడలో ఉన్న తులంన్నర బంగారు చైన్ కనిపించకపోవడంతో బోరున విలపించింది. బస్సు ఎక్కేటప్పుడు జనం ఎక్కువగా ఉండటంతో గుంపులో చోరీ జరిగినట్లు తెలుస్తుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు విచారణ చేస్తున్నట్లు పట్టణ పోలీసులు తెలిపారు.

రస్తా, పైపులైన్ విషయంలో ఘర్షణ

తుగ్గలి: పొలం రస్తా, పైపులైన్ వేసే విషయమై బొందిమడుగులలో రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది. గురువారం గ్రామానికి చెందిన మహబూబ్‌బాషా, పిట్టల బాషా పొలంలో పైపులైన్, రస్తా విషయంలో గొడవ పడ్డారు. ఘర్షణలో వీరిద్దరితో పాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. బాధితులు తుగ్గలి పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించారు.

కేజీబీవీలో అడ్మిషన్లు

హాలహర్వి: స్థానిక కస్తూర్బా గాంధీ గురుకుల విద్యాలయంలో ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం (ఎంపీసీ)లో ప్రవేశాలకు అర్హులైన విద్యార్థినుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ పద్మావతి తెలిపారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. విద్యాలయంలో మొత్తం 40 సీట్లు ఉండగా ఇప్పటివరకు 14 మంది జాయిన్ అయ్యారన్నారు. ఇంకా 26 సీట్లు మిగిలి ఉన్నాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండో కౌన్సెలింగ్‌కు పదో తరగతి పూర్తి అయిన విద్యార్థినులకు మరోసారి అవకాశం కల్పించామన్నారు. వివరాలకు 89740 15841 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

భక్తిశ్రద్ధలతో సత్యనారాయణ స్వామి వ్రతం

గోనెగండ్ల: శ్రావణ పూర్ణిమ సందర్భంగా తిరుమల తిరుపతి దేవస్థానములు(టీటీడీ) హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ ఆధ్వర్యంలో హెచ్.కైరవాడి గ్రామంలోని శ్రీరామలయ దేవాలయంలో గురువారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేదపండితులు ఇంద్రకంటి రాజేంద్ర శర్మ వ్రత మహత్యాన్ని వివరించారు. టీటీడీ హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఉమ్మడి కర్నూలు జిల్లా శాఖ కార్యనిర్వహకులు డాక్టర్ మల్లు వెంకటరెడ్డి, రామలయ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాసులు రెడ్డి, కార్యదర్శి జయంతి, సత్యనారాయణ శెట్టి, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

హైవే పక్కన హోటళ్లలో చోరీ

వెల్దుర్తి: హైవే–44పై చెరుకులపాడు క్రాస్‌రోడ్‌లో గల నాలుగు హోటళ్లలో దొంగలు పడ్డారు. బుధవారం రాత్రి దుండగులు రేకులు, ఇనుప కిటికీలను తొలగించి మూడు హోటళ్లలో చోరీలకు పాల్పడ్డారు. సురేశ్‌కు చెందిన హోటల్‌లో గ్రైండర్, మిక్సీ, సిగిరెట్ ప్యాకెట్లు, సుంకన్నకు చెందిన హోటల్‌లో రూ.4 వేల నగదు, సిగిరెట్ ప్యాకెట్లు, మధు హోటల్‌లో రూ.2 వేల నగదు, సిగిరెట్ ప్యాకెట్లు మొత్తంగా రూ.35 వేల సామగ్రి, అమ్మకపు వస్తువులు దోచుకెళ్లారు. ఉదయం తమ తమ హోటళ్లకు చేరుకున్న బాధితులు అందించిన సమాచారం మేరకు ఏఎస్ఐ శివరామిరెడ్డి సంఘటనాస్థలాలకు చేరుకుని విచారించారు. కిటికీలు, రేకులు తొలగించేందుకు ఉపయోగించిన గడ్డపారలను ఘటనాస్థలంలో స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకుని విచారిస్తున్నట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు.

సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శం


హెచ్.కైరవాడిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి

గోనెగండ్ల: రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలిచిందని, సంక్షేమ పథకాలను ప్రజలకు సక్రమంగా అందించేందుకు, పరిపాలనను ప్రతి గడప వద్దకు తీసుకెళ్లేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఈ వ్యవస్థను ఏర్పాటు చేశారని ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి అన్నారు. హెచ్. కైరవాడి గ్రామంలో రూ.40 లక్షలతో నిర్మించిన గ్రామ సచివాలయ భవనాన్ని గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి, ఎంపీపీ నసురుద్దీన్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్, తహసీల్దార్ వేణుగోపాల్‌లతో కలిసి రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ముందుగా హెచ్.కై రవాడి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యేకు స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు ఘన స్వాగతం పలికి పూలమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో ప్రజలు తమ సమస్యలు, ప్రభుత్వ సంక్షేమ పథకాలు, వివిధ సేవల కోసం మండల కేంద్రాలకు వెళ్లేవారు. చిన్నచిన్న పనులకు సైతం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ వ్యవప్రయాసలకు లోనవుతున్న ప్రజల కష్టాలను పాదయాత్రలో తెలుసుకున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ప్రజల వద్దకే పాలన అందించేలా గ్రామ సచివాలయ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని చెప్పారు. 2 వేల జనాభాకు ఒక సచివాలయం ఏర్పాటు చేసి ప్రతి 50 ఇళ్లకు ఓ వలంటీర్‌ను నియమించి ప్రజల ఇళ్ల వద్దకే సేవలందించారని వివరించారు. ప్రజా సంక్షేమానికి పాటుపడుతున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రానున్న ఎన్నికల్లో అండగా నిలవాలని పిలుపునిచ్చారు. పీఆర్ డీఈ, ఏఈ చంద్రశేఖర్, శివశంకర్, ఈఓఆర్డీ నాగేష్, వైస్ ఎంపీపీ వెంకట్రామిరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ సువర్ణ పాల్గొన్నారు.

అయ్యకొండలో విగ్రహావిష్కరణ పూజలు

గోనెగండ్ల: మండల పరిధిలోని అయ్యకొండ గ్రామంలో చింతలాముని, నల్లారెడ్డి స్వాముల ఆలయ శిఖరం, అంజనేయ స్వామి విగ్రహాలను గురువారం ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి ఆవిష్కరించారు. వేడుకలను పూజారులు వేద మంత్రోచ్ఛరణతో వైభవంగా జరిపించారు. ఎమ్మెల్యే శిఖరం, విగ్రహాన్ని ఆవిష్కరించి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామస్తులు ఉదయం నుంచే దేవాలయాల్లో భక్తిశ్రద్ధలతో పూజలు చేసి మొక్కలు తీర్చుకున్నారు. ఎంపీపీ టి. నసురుద్దీన్, సింగిల్‌విండో అధ్యక్షుడు తిరుమల రెడ్డి, సర్పంచ్ రాముడు తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా మున్సిపల్ మీట్


సభ్యుల మధ్య వాదోపవాదాలు జరుగుతున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలో కుక్కల బెడదను అరికట్టలేని మున్సిపల్ కమిషనర్ వైఎస్సార్‌సీపీ రంగుపూసుకొన్నాడని మాజీ ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర్‌రెడ్డి రెండు రోజుల క్రితం ఆరోపించడంపై అధికార పక్షం సభ్యులు విపక్ష సభ్యులపై ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇరుపక్షాల వాదోపవాదాలతో మున్సిపల్ కౌన్సిల్ రసాభాసగా జరిగింది. గురువారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కేఎస్ రఘు అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది. పట్టణాభివృద్ధికి కృషి చేస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డిపై మాజీ ఎమ్మెల్యే అనవసరంగా ఆరోపణలు చేయడం తగదని వైస్ చైర్మన్ నజీర్‌అహమ్మద్ పేర్కొన్నారు. కుక్కల బెడద నివారణకు స్టెరిలైజేషన్, యాంటీ రేబిస్ వ్యాక్సిన్లు వేయించేలా కమిషనర్ చర్యలు తీసుకున్నారని వైస్ చైర్మన్ వివరించారు. విపక్ష కౌన్సిలర్లు దయాసాగర్, రామ్‌దాస్‌గౌడ్ ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డుల్లోనూ ఎమ్మెల్యే చెన్నకేశవ రెడ్డి వివక్ష చూపకుండా అభివృద్ధి పనులు చేపట్టారని అయినా మాజీ ఎమ్మెల్యే కమిషనర్‌పై అసత్య ఆరోపణలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. దీంతో ఇరుపక్షాలు వాదోపవాదాలకు దిగాయి. చైర్మన్ సర్దిచెప్పేందుకు ప్రయత్నించినా వారు వినకపోవడంతో బెల్‌కొట్టి సభ ముగిసిందంటూ లేచి వెళ్లారు. అంతకుముందు పట్టణంలోని 22వ వార్డులో రూ.11 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం, 26వ వార్డులో సీసీ రోడ్డు నిర్మాణానికి సాధారణ నిధుల నుంచి కేటాయించడం, పోలీసు శాఖవారి వినతి మేరకు సీసీ కెమెరాల ఏర్పాటుకు రూ.3 లక్షలు కేటాయించేందుకు కౌన్సిల్ సభ్యులు టేబుల్ అజెండాను ఆమోదించారు. మున్సిపాలిటీ పరిధిలోని పలు కేసులకు సంబంధించి స్టాండింగ్ కౌన్సిల్‌కు ఫీజులు చెల్లించేందుకు, కలుగోట్ల రోడ్డు నుంచి టిడ్కో గృహాల ముందు నుంచి బైపాస్ రోడ్డు నిర్మాణానికి డీటైల్డ్ రిపోర్ట్, ఎస్టిమేట్లు, భూసేకరణ వివరాలు తయారు చేసేందుకుగాను ప్రైవేట్ కన్సల్టెన్సీకి రూ.10.80 లక్షలు మంజూరుకు, పలు అభివృద్ధి పనులతో పాటు అజెండాలోని 22 అంశాలను కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. వైస్ చైర్మన్ దివ్యకళ, కోఆప్షన్ సభ్యుడు అబ్రార్, మున్సిపల్ డీఈలు, మనోహర్‌రెడ్డి, నీరజ, మేనేజర్ బేబి, టీపీఓ గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మోడల్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ


బహుమతి అందుకుంటున్న గోనెగండ్ల మోడల్ స్కూల్ విద్యార్థినులు

గోనెగండ్ల: ఆంధ్రప్రదేశ్ స్కూల్ ఇన్నోవేషన్ ప్రోగ్రాంలో భాగంగా రాష్ట్రస్థాయి గ్రాండ్ ఫినాలేలో గోనెగండ్ల ఏపీ మోడల్ స్కూల్ విద్యార్థినులు ప్రదర్శించిన సైన్స్ ప్రాజెక్టు (స్మార్ట్ యూ టర్న్) ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. ఈ సందర్భంగా గురువారం ఆ పాఠశాల ప్రిన్సిపాల్ షాహినా పర్వీన్ మాట్లాడుతూ.. ఆగస్టు 28, 29, 30 తేదీలలో రాష్ట్రస్థాయిలో విజయవాడలో జరిగిన బూట్ క్యాంప్ గ్రాండ్ ఫినాలేలో వివిధ జిల్లాల నుంచి విద్యార్థులు రూపొందించిన 27 సైన్స్ ప్రాజెక్టులను ప్రదర్శించారు. ఈ పోటీలో గోనెగండ్ల మోడల్ స్కూల్ 9వ తరగతి విద్యార్థినులు రాయినా అప్సనా, స్రవంతి, అస్మంజు, సంధ్య, రాధిక రూపొందించిన సైన్స్ ప్రాజెక్టు ద్వితీయ బహుమతిని గెలుచుకుంది. దీంతో రూ.75వేల నగదుతో పాటు ప్రశంసా పత్రాలను అందించిన అధికారులు విద్యార్థినులను సత్కరించారు. సైన్స్ ప్రదర్శనలో సత్తాచాటిన విద్యార్థునులను ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు అభినందించారు.

భవన నిర్మాణాలు వేగవంతం చేయండి


కనకవీడులో సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలిస్తున్న పీఆర్‌ఏఈ జయన్న

నందవరం: గ్రామాల్లో చేపట్టిన ప్రభుత్వ భవన నిర్మాణాలను వేగవంతం చేయాలని ఏజెన్సీ సభ్యులకు పంచాయతీ రాజ్ ఏఈ జయన్న సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని పెద్దకొత్తిలి, కనకవీడులో విలేజ్ హెల్త్ క్లినిక్ సెంటర్‌లో స్లాబ్, గోడలకు ప్లాస్టరింగ్ పనులను పీఆర్ ఏఈ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయ న మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల చెంతకే సేవలు అందించేందుకు రైతు భరోసా కేంద్రాలు, సచివాలయాలు, హెల్త్ సెంటర్లు, పాల శీతలికరణ కేంద్రాలను ప్రవేశపెట్టిందన్నారు. భవన నిర్మా ణాలు త్వరగా పూర్తి చేసేలా చర్యలు చేపట్టామన్నారు. మండలంలో 19 ఆర్బీకేలు, 19 సచివాలయాలు, 7 వైఎస్సార్ హెల్త్ క్లినిక్ సెంటర్ల నిర్మాణాలు చేపట్టామన్నారు. ఆయా భవన నిర్మాణాలు తుదిదశకు చేరుకున్నాయని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

మొక్కల పెంపకంతోనే ఆరోగ్యం

గోనెగండ్ల: మొక్కలను పెంచడం వల్ల భావితరాలకు ఆహ్లాదకర వాతావరణం అందుతుందని పీఆర్ డీఈ చంద్రశేఖర్, ఎంపీడీఓ ప్రవీణ్‌కుమార్ అన్నారు. గురువారం మండలంలోని హెచ్. కైరవాడి గ్రామంలోని సచివాలయం ఆవరణంలో అధికారులు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మొక్కలను నాటారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతిఒక్కరూ మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. పీఆర్ ఏఈ శివశంకర్, ఈఓఆర్డీ నాగేష్, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు మోహన్ రెడ్డి, పులికొండ, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

స్థల ఆక్రమణ జరగలేదు

ఎమ్మిగనూరుటౌన్: పట్టణంలోని కోర్టు రోడ్డులో స్థలం ఆక్రమణకు గురికాలేదని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పేర్కొన్నారు. స్థల ఆక్రమణ జరిగిందంటూ కొందరు నిరాధార ఫిర్యాదులు చే యడంతో ఆ వార్డు సచివాలయ ప్లానింగ్, రెగ్యులేషన్ సెక్రటరీలు గురువారం ఆ స్థలాన్ని పరిశీలించి ఎలాంటి ఆక్రమణకు గురికాలేదని నివేదించారని స్పష్టం చేశారు. ఆ స్థలంపై హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉందన్నారు. స్థల ఆక్రమణ జరుగకుండా చర్యలు తీసుకున్నామన్నారు.